క్లుప్తంగా

ఘనంగా గ్రామదేవత పండగ



ఆలయం వద్ద భక్తుల సందడి

పూసపాటిరేగ: మండలంలోని పూసపాటి పాలెం గ్రామదేవత రాజమ్మ పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ అమ్మవారి ఘటాలను భక్తులు ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో విస్తృతంగా తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతర నేపథ్యంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు నగరంలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈ నెల 6న తొలేళ్ల ఉత్సవం, 7వ తేదీన సిరిమానోత్సవం జరగనున్న నేపథ్యంలో పోలీస్ బృందాలతో తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదివారం తెలిపారు. వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

కళాకారులకు సన్మానం



శ్రీనాథ విజయం నాటకం కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

విజయనగరం టౌన్: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక లేడీస్ రీక్రియేషన్ క్లబ్‌లో చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదివారం ప్రదర్శించిన శ్రీనాథ విజయం నాటకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పలువురు కళాకారులను నిర్వాహకులు సన్మానించారు.

హరికథా గానం..



హరికథా గానం చేస్తున్న ఆదిభట్ల సూర్య నారాయణ

విజయనగరం టౌన్: విజయనగరం ఉత్సవాలు పురస్కరించుకుని, గురజాడ కళాభారతి వేదికపై పలువురు కళాకారులు చేసిన ఏకపాత్రాభినయం, నాటికలు వీక్షకులను ఆలోచింపజేశాయి. నేనొక నటుడనని విజయమోహన విహారి, దాశరథి పాత్రలో నిర్మలమూర్తి, ఆంజనేయుడిగా దేవుడు, నక్షత్రకుడిగా తవిటినాయుడు, అరణ్య సీన్ వేసిన కళాకారుడిగా రత్నాజీరావు, అర్జునుడిగా శ్రీనివాస్, ఆదిభట్ల సూర్యనారాయణ హరికథా గానం ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న కన్యాశుల్కం నాటకం



కన్యాశుల్కం నాటకంలో మధురవాణి ఇల్లు సీను దృశ్యం

విజయనగరం గంటస్తంభం: విజయనగరం ఉత్సవాలు సందర్భంగా జిల్లా కేంద్రంలో విజయసూర్య ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం వేసిన కన్యాశుల్కం నాటకం ఆకట్టుకుంది. బొంకులదిబ్బ సీను, మధురవాణి ఇల్లు(మంచం సీను), అగ్నిహోత్రావధానుల ఇల్లు(తాంబూలాలు సీను), సౌజన్యరావు పంతులు ఇల్లు(డామిట్ కథ అడ్డం తిరిగింది సీను), లుబ్ధావధానులు ఇల్లు సీను వంటి నాటకంలోని కొన్ని ముఖ్య సన్నివేశాలు చూపరులను ఆద్యంతం అలరించాయి.

కొట్లాట ఘటనపై కేసు నమోదు

భోగాపురం: మండల కేంద్రంలో ఈ నెల 2వ తేదీన కనకదుర్గమ్మ నిమజ్జనోత్సవంలో భాగంగా చేపట్టిన ఊరేగింపులో ఓ రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పాపారావు ఆదివారం తెలిపారు. దసరా ఉత్సవాల్లో భాగంగా జరిగిన ఊరేగింపులో దుబ్బక సురేష్, లోకేశ్, అభి అనే ముగ్గురు వ్యక్తులు కలిసి మరడ వంశీ అనే వ్యక్తిని పంచాయతీ కార్యాలయం వద్దకు రమ్మని అతడిపై దాడికి ఎగబడ్డారు. ఈ దాడిలో వంశీ చేయి విరిగిపోగా అతడి స్నేహితుడు అడ్డగర్ల అరుణ్‌కుమార్..చికిత్స నిమిత్తం వంశీని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

యువతి అదృశ్యం..

భోగాపురం: మండలంలోని కొల్లిపేటకు చెందిన ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సూర్యకుమారి ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి ఇంతవరకు ఇంటికి రాలేదని, చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినా లేకపోవడంతో యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న విజయనగరంలోని పలు ప్రాంతాలు

నగరంలో..ఉత్సవ శోభ!

- వైభవంగా విజయనగరం ఉత్సవాలు
- విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న పురవీధులు
- రూ.90 లక్షల వ్యయంతో నగర సుందరీకరణ
- పర్యాటకులకు ఆహ్లాదం పంచేలా ఏర్పాట్లు

విజయనగరం: నగరంలో ఉత్సవ శోభ సంతరించుకుంది. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా విజయనగరం ఉత్సవాలతో పాటు పైడితల్లి జాతరకు నగరం ముస్తాబైంది. గత కొన్నిరోజులుగా వీటికి సంబంధించిన పనులు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చాలా చురుగ్గా జరిగాయి. ఓ వైపు పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ఉత్సవాలు చూసేందుకు నగరానికి విచ్చేసే వారికి ఆహ్లాదం పంచేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. గతేడాది మిగిలిన రూ.30 లక్షల నిధులతో పాటు ప్రస్తుతం మంజూరు చేసిన రూ.60 లక్షలు మొత్తం కలిపి రూ.90 లక్షల వ్యయంతో నగర సుందరీకరణ సహా వేడుకలకు వచ్చే వారికి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నారు.

ఎక్కడెక్కడ ఏయే ఏర్పాట్లు..

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతర నేపథ్యంలో నెల రోజులుగా విజయనగరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. రూ.4.20 లక్షలతో నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఫౌంటేన్‌లు, వాటి పరిసరాల్లో మరమ్మతులు, రూ.9.70 లక్షలతో విజయనగరం ఉత్సవాల 11 వేదికలు, నగరంలోని ప్రధాన జంక్షన్లలో ప్రజలకు ఉపయోగపడేలా తాత్కాలిక మరుగుదొడ్లు, రూ.10.65 లక్షలతో నగరంలోని అన్ని ప్రధాన మార్గాల్లో సెంట్రల్ డివైడర్లు, వాటికి రంగులు, రూ.1.85 లక్షలతో ఆది, సోమ, మంగళవారాల్లో నగర ప్రజలకు తాగునీరు, రూ.4.5 లక్షలతో పారిశుధ్య పనులకు సామగ్రి వంటివి ఏర్పాటు చేశారు.

-ఇతర రాష్ట్రాల నుంచి..

మొత్తం మూడు రోజుల పాటు జరిగే విజయనగరం ఉత్సవాలతో పాటు పైడితల్లి జాతర మహోత్సవం చూసేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విజయనగరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలో ఏర్పాటు చేసిన 11 వేదికలపై జరిగే కార్యక్రమాలను భక్తులు, పర్యాటకులు, సందర్శకులు వీక్షిస్తారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో రూ.18 లక్షల వ్యయంతో రోడ్లలోని గుంతలు పూడ్చడంతో పాటు, రోడ్ల మరమ్మతులు చేపట్టారు.



డ్వాక్రా బజారు వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్ల వద్ద డ్రమ్ముల్లో నీరు నింపుతున్న దృశ్యం

అందరి సహకారంతో ఇది సాధ్యం..



ప్రజలందరి సహకారంతోనే విజయనగరం ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడం సాధ్యవుతోంది. అన్ని ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులు, సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాం.

– పల్లి నల్లనయ్య, కమిషనర్, విజయనగరం నగరపాలక సంస్థ

వైఎస్ జగన్ పేరిట అదృష్టాన్ని పరీక్షించుకున్న అభిమాని

- లక్కీ డ్రాలో 43 ఇంచీల స్మార్ట్ టీవీ దక్కించుకున్న సత్యనారాయణ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో ఉన్న కూపన్



లక్కీ డ్రాలో మొదటి బహుమతి పొందిన జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో ఉన్న కూపన్

నెల్లిమర్ల రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరిట తన అదృష్టాన్ని పరీక్షించుకున్నాడో అభిమాని. మండలంలోని కొండవెలగవాడలో దేవీ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన లక్కీ డ్రాలో అదే గ్రామానికి చెందిన బొంతు సత్యనారాయణ రూ.20లతో కొనుగోలు చేసిన కూపన్‌పై తన అభిమాన నాయకుడైన జగన్‌మోహన్‌రెడ్డి పేరును రాసి, బాక్సులో వేశారు. ఆదివారం తీసిన లక్కీ డ్రాలో ఆయన కూపన్(5099)కే మొదటి బహుమతి రాగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు 43 ఇంచీల ఎల్‌ఈడీ టీవీని బహూకరించారు. ఆయన ఆనందానికి అవధుల్లేవు. తమ అభిమాన నేత పేరు రాస్తే ఇంత అదృష్టమా అని ఆశ్చర్యచకితుడై ఆనందంతో అందరికీ జగన్‌మోహన్‌రెడ్డి పేరు గల కూపన్ చూపించి సంతోషం వ్యక్తం చేశాడు. విజేతను జెడ్పీటీసీ సన్యాసినాయుడు అభినందించారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. ఇదే విషయమై ఆయన స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో పోలీస్ బృందాలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. వేడుకల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా జేబు దొంగతనాలు, చైన్‌స్నాచింగ్ జరగకుండా చూడాలన్నారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని, ఆ దిశగా పోలీస్ బృందాలు విధులు నిర్వహించాలని, ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, చింతూరు అదనపు ఎస్పీ పంకజ్కుమార్ మీనా, డీఎస్పీలు ఆర్.గోవిందరావు, జి.భవ్యరెడ్డి, ఎస్.రాఘువులు, ఎం.వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ పద్మనాభరాజు, తదితరులు

డెంకాడ: సైక్లింగ్‌తో మానసిక ఉల్లాసం కలగడంతో పాటు శారీరక ఆరోగ్యం లభిస్తుందని ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ నుంచి ఐనాడ జంక్షన్ మీదుగా సైకిల్ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం చేసుకోవాలని, సైక్లింగ్ కూడా ఒక వ్యాయామమే నన్నారు. మంచి ఆహారపు అలవాట్లు పాటించడంతో పాటు వ్యాయామం కూడా అలవాటు చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడిషనల్ కమాండెంట్ జీవీ ప్రభాకరరావు, అసిస్టెంట్ కమాండెంట్‌లు బాపూజీ రావు, డీవీ రమణమూర్తి, ఎం.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

విజయనగరం అర్బన్: సచివాలయ కార్యదర్శుల విజయనగరం యూఎల్‌బీ(అర్బన్ లెవల్ బాడీ) కొత్త కార్యవర్గం ఏర్పాటు చేశారు. సంఘ అధ్యక్షుడిగా బూసల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా ఎం.కమలాకర్, రమాదేవి, జాయింట్ సెక్రటరీగా పి.శ్రీకాంత్, కోశాధికారిగా జి.సుజిత్, ఎగ్జిక్యూటివ్ మెంటర్‌గా ఎస్.మధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆర్థికసాయం అందజేత

భోగాపురం: మండలంలోని రామచంద్రపేటకు చెందిన ఇప్పిలి రాంబాబు అనే యువకుడికి నోడగల రాము అనే వ్యక్తి ఆర్థికసాయం చేశారు. రాంబాబు తల్లిదండ్రులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి వైద్యసేవల కోసం ఇల్లు తాకట్టు పెట్టడంతో పాటు కొంత అప్పులు చేయడం జరిగింది. ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్న రాంబాబు పరిస్థితిని తెలుసుకున్న రాము..అతడిని ఆదుకునేందుకు ముందుకువచ్చారు. రూ.50 వేలను తనవంతు సాయంగా ఆదివారం అందజేసి, అండగా నిలిచారు.

నేడు అన్నప్రసాదం పంపిణీ

విజయనగరం అర్బన్: పైడితల్లి జాతర సందర్భంగా నగరంలోని రైల్వేస్టేషన్, రెవెన్యూ హోమ్ ప్రాంతాల్లో అన్నప్రసాదం పంపిణీ చేస్తున్నట్లు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తాడ్డి గోవింద్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మొత్తం 10 వేల మంది భక్తులకు పంపిణీ చేసేలా ప్రసాదం సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా!





గీతాలాపన చేస్తున్న గాయనీగాయకులు లక్ష్మీనాయుడు, సౌజన్య, మధుప్రియ

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతర పురస్కరించుకుని, విజయనగరం జిల్లా కేంద్రంలోని అయోధ్య మైదానంలో ఆదివారం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగాయి. ప్రధానంగా సినీ సంగీత కళాకారులచే చేసిన మ్యూజికల్ నైట్ కార్యక్రమం ఆద్యంతం చూపరులను అలరించింది. సింగర్ మధుప్రియ చేసిన గీతాలాపనలు యువతను ఉర్రూతలూగించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

తుప్పల్లో వర్షపాత నమోదు యంత్రాలు



తుప్పల్లో ఉన్న వర్షపాత నమోదు యంత్రం



భూగర్భజల నమోదు యంత్రం దుస్థితిది..

లక్కవరపుకోట: వర్షపాతం లెక్కింపు కోసం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మెషీన్లు తుప్పుల్లో మూలుగుతున్నాయి. కురిసిన వర్షాలను ఆటోమేటిక్ వర్షపాతం నమోదు కేంద్రం ద్వారా లెక్కించి ఆ మండలాన్ని కరువు ప్రాంతంగా అధికారులు ప్రకటిస్తారు. అయితే మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఆటోమెటిక్ వర్షపాత నమోదు యంత్రం, భూగర్భ జలాల అంచనా యంత్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా భూగర్భ జలాలు అంచనా, వర్షపాత నమోదు లెక్కించి మండల స్థితిగతులను అంచనా వేస్తారు. అలాంటి కేంద్రాలు ప్రస్తుతం తుప్పల్లో మూలుగుతున్నాయి. కనీసం ఆయా కేంద్రాలకు వెళ్లేందుకు దారి సైతం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆకట్టుకున్న ఆర్‌సీపీ రోవర్ ప్రాజెక్టు



రామ్‌చరణ్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

విజయనగరం: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నగరంలోని కోట ప్రాంగణంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి రామ్‌చరణ్ ప్రదర్శించిన ఆర్‌సీపీ రోవర్ ప్రాజెక్టు ఆకట్టుకుంది. ఇటీవల నాసా మార్స్‌పైకి ప్రయోగించిన రోవర్ రోబోటిక్స్ ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు అందరి దృష్టిని ఆకర్షించింది. అంతరిక్ష పరిశోధనలో రోవర్ సెన్సార్ సాయంతో అక్కడి భౌగోళిక, వాతావరణ పరిస్థితులను గుర్తిస్తుందని సందర్శకులకు రామ్‌చరణ్ వివరించాడు. మానవులకు బదులుగా వీటిని వినియోగించడం వల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయని తెలిపాడు. యూట్యూబ్‌లో వీడియోల ఆధారంగా ఈ ప్రాజెక్టు తయారు చేశానని, ఇస్రో సైంటిస్ట్‌గా ఎదగడమే తన లక్ష్యమని విద్యార్థి తెలిపాడు.



శృంగవరపుకోట: ఊరేగింపులో దుర్గాదేవి విగ్రహం



శృంగవరపుకోట: దేవీ సంబరాల్లో రామ, లక్షణ సమేత మారుతి

అమ్మ కదిలింది..

- సంబరంగా ఊరేగింపు
- ఆకట్టుకున్న నృత్యాలు..

శృంగవరపుకోట: పట్టణంలో కొలువుదీరిన దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది అవతారాలతో అలరించింది. నవరాత్రులు ముగియడంతో శనివారం రాత్రి అమ్మ ఊరేగింపు ఉత్సవాన్ని దేవీ ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించింది. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై కొలువుదీర్చి మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాలుస్తూ ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అమ్మవారి ఊరేగింపు ఉత్సవాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు.



శృంగవరపుకోట: వేర్వేరు వాయిద్యాలతో గణపతులు



శృంగవరపుకోట: సంబరంలో అలరించిన నవదుర్గలు



వేపాడ: వల్లంపూడి పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు

వైభవంగా దేవీ నిమజ్జనోత్సవం

వేపాడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వల్లంపూడిలో కొలువుదీరిన అమ్మవారిని శనివారం రాత్రి గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజల పాటు వివిధ అలంకరణలతో దర్శనమిచ్చిన దేవీకి భవానీ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వేపాడ, వల్లంపూడి జంట గ్రామాల్లో అమ్మవారిని మేళతాళాల నడుమ ఊరేగించి దబ్బిరాజుచెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేషధారణలు అలరించాయి.



వేపాడ: పార్వతీపరమేశ్వర్ల వేషధారణలో కళాకారులు

మా ఆకలి కేకలు వినబడవా..



మా ఆకలి కేకలు ప్రభుత్వానికి వినబడడం లేదా అని జిందాల్ నిర్వాసితులు ప్రశ్నించారు. బొడ్డవరలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం కూడా కొనసాగించారు. జిందాల్ కంపెనీ సేకరించిన భూములను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

– శృంగవరపుకోట

ఘనంగా కనకతల్లి పండగ

గుర్ల: మండలంలోని కెల్లలో కనకతల్లి పండుగ ను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో అభిషేకాలు చేశారు. అలాగే ముర్రాటలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రభలను గ్రామంలో ఊరేగించారు.